# సంస్కారానికి సంకెళ్ళు

ఎ. రుక్మిణి

(గత సంచిక తరువాయి)

రెండు రోజులు నేను సావిత్రినీ, కొడుకునీ మరచిపోదామని చాలా ప్రయత్నం చేశాను. నాకు సాధ్యపడలేదు. ఆ రోజు సాయంకాలం ఏడు గంటల వేళ మురళి పరుగెట్టుకుని వచ్చాడు. వాళ్ళమ్మని నారాయణ కొడితే పడిపోయింది అని ఏడుస్తూ చెప్పాడు. నేను వెంటనే వెళ్ళాను. సావిత్రి స్పృహలేకుండా పడి ఉంది. శరీరంమీద బట్టలు పీలికల్లా చిరిగి ఉన్నాయి. వంటిమీద నాలుగయిదు వాతలు పెద్దవే ఉన్నాయి. అది చాలదన్నట్లు నుదుటిమీద చర్మం లోతుగా మూడంగుళాల వెడల్పున చిట్లిపోయింది. మురళిచేత రిక్షా పిలిపించి హాస్పిటలుకి తీసుకువచ్చాను. నుదుటిమీద చర్మం కుట్టిన ఒక గంట తరువాత ఆమె కళ్ళు విప్పింది.

"బాబూ! ఆ నరకంలోకి నన్ను పంపకండి. మీరే రక్షించాలి" అంటూ ఏడుస్తూ గభాలున నాకాళ్ళు పట్టేసుకుంది.

నేను చాలా సందిగ్గంలో పడిపోయాను. ముందు కాంపౌండరుని పొమ్మని యింటికి పంపించేశాను. వాడు కథలు వ్రాస్తాడో లేదో తెలియదు కాని నోటితో చెప్పడంలో ఘనుడు. వాడికిఅప్పటికేఒకసీరియల్‌కి తగినంతకథ లభించేసిందేమోనని అనుమానం వేసింది నాకు. అప్పటికి రాత్రి తొమ్మిది దాటిపోయింది. మురళిని పట్టుకుని ఆమె చాలాసేపు ఏడ్చింది. ఆమె హృదయ భారం తేరేవరకు ఊరుకొని ప్రశ్నించాను.

"నీకెవరూ బంధువులు లేరా?"

"నేనే అందరినీ వదులుకుని వచ్చాను" ఆమె రుద్ధ కంఠంతో మెల్లిగా అంది. ఆమె కథ చాలావరకు నాకు అర్థమయింది.

"ఇతను నిన్ను పెళ్ళి చేసుకున్నాడా?"

ఆమె లేదన్నట్లుగా తల కదిపింది. ఆ మాటతో కొంత రిలీఫ్ కలిగింది నాకు. ఆ రాక్షసుడి చేతులలోంచి తప్పించడం అంత కష్టం కాదనిపించింది.

"ఈ పరిస్థితిలో నీ బంధువులు నిన్ను ఆదరించరా?"

"వారికి నా ముఖమెలా చూపించను బాబుగారూ! అంతకంటె నేను చావు కోరుకుంటాను. వారి దగ్గర ప్రేమాదరణకి కరువాచి యితని మాటలు నమ్మి వచ్చేశాను. సావిత్రి తల వంచుకుని అంది.

"నీ భర్తవైపు వాళ్ళెవరూ లేరా?"

"ఆయన చనిపోయిన ఏడాదిలోగానే మా అత్త చనిపోయింది. యింకెవరూ లేరు"

ఆమె పరిస్థితి నాకర్థమయింది. అయితే సావిత్రి లాంటి ఆడది నారాయణ లాంటి వ్యక్తిని నమ్మి సర్వం సమర్పించిందంటే చాలా ఆశ్చర్యం కలిగింది.

"నన్ను పెళ్ళిచేసుకోకపోయినా యిలాగే జీవితాంతం ఉండిపోదామనే అనుకొన్నాను కాని నా ప్రారబ్ధం అంతటితో ఆగలేదు. ఆయన నా శరీరానికి వెలకట్టి అమ్మాలని ప్రయత్నించాడు. నేను అంగీకరించలేదని నాకీ నరకం" ఆమె ఏడుస్తూ చెప్పలేక చెప్పలేక చెప్పింది అవమానంతో.

"ఏమయినా చదువుకున్నావా?"

"లేదండి. నాకేదో చిన్న జీవనాధారం చూపిస్తే చాలు. ఆఖరికి కూలిపనయినా సరే. ఏదో మా ఇద్దరి కడుపులూ నిండితే చాలు. వీడికోసమే నేను చావలేక బ్రతుకుతున్నాను. నాకీ సహాయం చేసి పుణ్యం కట్టుకోండి బాబూ అంటూ ఆమె మళ్ళా నా కాళ్ళమీద పడింది. నేను బలవంతంగా లేవదీసి కూచోబెట్టాను. సముద్రంలో మునిగి పోయేవ్యక్తి గడ్డి పోచ కోసం ప్రాకులాడినట్లు ఆమె నామీద ఆధారపడింది. ధన సహాయం అంటే చేయగలను. కాని ఈ విధంగా ఆమె సంరక్షణ భారం పూర్తిగా నేనెలా వేసుకోగలను. ఎవరో అనాధస్త్రీకి నేను సహాయం చేస్తున్నానంటే సంఘం నమ్మదు. నారాయణని తల్చుకుంటే ఏదో విధంగా సావిత్రిని ఆ రాక్షసుడి హస్తాలలోనించి తప్పించాలని అనిపిస్తోంది. కాని ఏ విధంగా చెయ్యాలో నిశ్చయించలేకపోయాను. సంఘంతో నాకు ఒక హోదా, పరువు-ప్రతిష్ఠ అన్నీ వున్నాయి. సంఘంని ఎదిరించి నేను నా వృత్తిలో ముందుకుపోలేను. యివన్నీ కాక నేను నా భార్యారత్నం రాజ్యంకి నచ్చచెప్పాలి నేను కేవలం స్వార్థరహితంగా చేస్తున్నానని. తల్చుకుంటే అదంత సులువయిన పని కాదనిపిస్తోంది. అన్నీ అటువంటి ఆలోచనలతో నా తల వేడెక్కిపోయింది.

"తప్పకుండా నా చేతనయినంత సహాయం చేస్తాను. రెండు మూడు రోజులు ఓపిక పట్టు" అని ఆమెనీ కొడుకునీ ఇంటికి పంపేశాను. అప్పట్లో అంతకుమించి భరోసా యివ్వడానికి ధైర్యం చాలలేదు. మన సంఘంలో స్త్రీ వివాహం పేరుతో ఒక పురుషుడి ఆధీనంలో ఉంటేనే రక్షణ. మధ్యలో మొగుడు ఛస్తే ఆమె ఆ చచ్చినవాడి ఆత్మకే యింకా సొత్తునని సంఘానికి చెప్పుకోవాలి. లేనినాడు ఆమె ఎవరిసొత్తూ కాదు. ఎందుకంటే సంఘం స్త్రీకి పునర్వివాహపు హక్కు ఇవ్వదు. ఒకవేళ సంఘం దయతలచినా పురుషుడు దయ చూపడు. చచ్చిన మొగుడి ఆస్తిలో జమగా ఉండడానికి అంగీకరించకపోతే ఆ స్త్రీ ఎవరి సొత్తూ కాదు. అంటే అందరి సొత్తూను. ఆశపడ్డ వాళ్ళు అర్రులు చాచవచ్చు. అందిన వారు అనుభవించవచ్చు. రోడ్డు మీద ఎవరికీ కాని కుక్కపిల్ల ఉందనుకోండి. అది ఒకవేళ అందంగా ఉంటే ఎవరు యిష్టమయితే వారు పెంచుకుని స్వంతం చేసుకోవచ్చు. అలా కాక గజ్జిపట్టి అందవికారంగా ఉంటే ఎవరయినా నాలుగు రాళ్ళు విసిరి చంపిపారేసి సంఘసేవ చెయ్యొచ్చు. దానికి ప్రొటెస్ట్ చేయడానికి గవర్నమెంటు లేదు. మనకున్న అది సంఘంలో ఒక భాగమే. మూకన్యాయం ముందు 'లా' పని చెయ్యదు. ఇది అందరికీ తెలిసిన విషయమే.

రాత్రి యిల్లు చేరేసరికి పదయింది. రాజ్యం నిద్రమత్తులో తలుపు తీసి మళ్ళా పడుకుంది. నేను బట్టలు మార్చుకొని వచ్చేసరికి గాఢ నిద్రలో ఉంది. నిద్ర లేపాలని

డా॥ పి.వి.కె.రావ్, B.A. సెక్స్ స్పెషలిస్ట్



వైద్యవిద్వాన్ - వైద్యాచార్య హస్తప్రయోగం. నరముల బలహీనత. అంగము చిన్నదగుట. శీఘ్రస్ఖలనము. శుక్లనష్టము. సుఖరోగములకుమాన పిత వ్యాధులకు ఆయుర్వేద చికిత్స. పోస్టు ద్వారా కూడా చికిత్స గలదు.

రావూస్ క్లినిక్

టి. బి. రోడ్, తెనాలి. ఫోన్ : 700.

SUVARNA

# శుభవార్త!

డాక్టర్లకు సాధ్యముగాక వదలివేయబడిన అన్ని వ్యాధులకు చికిత్స చేయబడును. లావుపాటివారు సన్నగను, బలహీనులను బలవంతులుగను చేయబడుదురు. మధుమేహము, రక్తపుపోటు, కుష్ఠు, బొల్లి, క్యాన్సరు, సంతానము లేనివారుకూడా శ్రీ యోగిగారి కాయకల్ప చికిత్సవల్ల సంపూర్ణ ఫలము బడయగలరు. ఈ చికిత్సవలన దేహములోని వ్యాధులు తొలగిపోవుటయేగాక నూతన యవ్వనము కలుగును. వివరములు కోరువారు పోస్టు ఖర్చులకు రు. 3-00లు M.O. పంపవలయును.

శ్రీ యోగాశ్రమము
పెదవాల్తేరు పోస్టు
విశాఖపట్టణము

అనిపించలేదు. అన్నీ వెతుక్కుని అన్నం తినాలంటే బద్ధకంవేసి వెంటనే ముసుగు పెట్టేశాను.

తెల్లవారి తొమ్మిది గంటలకి మెలకువ వచ్చింది. రాత్రి అన్నం తినలేదేమో కడుపు ఖాళీగా అవురు మంది. గబగబా స్నానం కూడా చేసేసి వచ్చేసరికి పిల్లలు ముగురూ టేబులు మీద ఖాళీప్లేట్లు, మంచి నీళ్ళు పెట్టేసుకు కూర్చున్నారు. వంటింటికి ముక్కులు అతికేసి. వంటింట్లోంచి ఉప్మా పోపు వాసన నా ముక్కుకి కూడా వెంటనే పట్టేసింది. నన్ను చూడగానే ముక్త కంఠంతో చెప్పేశారు. ఆ బృంద గానం సారాంశం "ఫ్లాస్కు పగిలిపోయింది. నా కింక కాఫీలేదు" అసలే ఆకలి! ఒళ్ళు మండిపోయింది.

"ఎవరా రాస్కెల్ పగలకొట్టింది?" అనబోయి ఆఖరి క్షణంలో విరమించాను. ఒకవేళ రాజ్యం చేతిలోనే ఫ్లాస్కు మోక్షం పొందిందేమోనని అనుమానం వేసింది.

నిశ్శబ్దంగా మరొక ప్లేటు దగ్గరకి లాక్కుని కూర్చున్నాను. మరింకో పది నిముషాలకి కూడా రాజ్యం సన్నాహం పూర్తికాలేదు. నా ముఖంచూసి రాజు, బాబి, లక్ష్మి ముగ్గురూ నోరు మెదపకుండా కూర్చున్నారు.

"రాజ్యం! టిఫినయిపోయిందేమిటి?" అసహనంగా అడిగాను.

"అదే అఘోరిస్తున్నాను. నాకేం నాలుగు చేతులు లేవు." మరొక అయిదు నిమిషాలకి పట్టకారుతో గిన్నె పట్టుకొచ్చి బల్లమీద కుదేసింది. అందరం యుద్ధం చేసేసి ప్లేట్లలో సర్దేసుకున్నాం. ఉన్నదంతే. రాజ్యం నా అర్థాంగి కాబట్టి నా ప్లేట్లోది సగం మళ్ళా గిన్నెలో పడేశాను.

తినడం మొదలుపెట్టి ఆగాను. "రాజ్యం నువ్వుకూడా తినెయ్యకూడదూ!" పిలిచాను.

"ఇంత ప్రేమ ఎక్కడనించి వచ్చింది అకస్మాత్తుగా. జోకులక్కర లేదు. అందులో ఏం తక్కువయిందో చెప్తే సంతోషిస్తాను." రాజ్యం రోష కషాయిత నేత్రాలతో అదరుతున్న పెదవులతో వచ్చింది. ఆ క్షణంలో ఎంతో అందంగా ఉంది నాకు. "బలేదానివే. నాకు నీమీద ప్రేమలేనిదెపుడు." నేను పునరుద్ఘాటించబోయాను కాని బాబిగాడు బాంబు పేల్చేశాడు "అమ్మా! ఉప్మా జావలాగ చప్పగా ఉందే" అంటూ నా ప్రమేయం లేకుండా మిగిలిన ఇద్దరూ వాడిని సమర్థించేసి ఉప్మాలో ఉప్పులేదని తేల్చేసి ప్లేట్లు తోసేశారు. వాళ్ళ వీపుల గురించి నాకు భయం వేసింది.

'అంతా నా ఖర్మ' అని రాజ్యం ఒక సారి నెత్తిమొత్తుకుని వంటింట్లోకి వెళ్ళిపోయింది. యిక అందరం ధైర్యంగా టేబిలు దగ్గరనించి లేచిపోయాం. "ఒరే రాజా అమ్మకీ మీకూ టిఫిను తెచ్చుకోండిరా!" అని అయిదు రూపాయల నోటు తీసిచ్చాను.

"అమ్మకి ముందే చెప్పాను. హోటలు నించి తెచ్చుకుందామని." అంటూ వాడు ఉత్సాహంతో పరుగెట్టాడు. నేను హాస్పిటల్‌కి పోడానికి తయారవుతూంటే రాజ్యం వచ్చింది గదిలోకి.

"చెయ్యలేక ఛస్తున్నాను. తీరా చేస్తే అందరూ వంకలు పెట్టేవారే. మీరెవరయినా వంటదాన్ని చూడకపోతే నేను కొన్నాళ్ళు నాన్నగారి దగ్గిరకి వెళ్తాను" బ్రహ్మాస్త్రం వేసేసింది.

"అదికాదు రాజ్యం! ఆడవాళ్ళు చూసుకోవలసినవి. నీకెవరూ దొరక్కపోతే నాకుమాత్రం దొరుకుతారేంటి?" అన్నాక మెరుపులా వచ్చింది ఆలోచన. సావిత్రినీ కొడుకునీ మా యింట్లోనే ఉంచుకోవచ్చు. రాజ్యంకి వంటమనిషి బెడద వదిలిపోతుంది.

"రాజ్యం-మాట" వెళ్ళిపోతూంటే పిలిచాను. "నా పేషంట్లలో ఒక మనిషి వుందనుకో. ఒక పదేళ్ళ కొడుకు కూడా ఉన్నాడు. మరి ఇల్లు వాకిలీ ఏమీ లేవు. మనింట్లోనే వుంచుకోవాలి, వీలవుతుందా మరి."

"అదే మంచిది. రెండు రోజులకొక సారి మానెయ్యడానికి వీలుండదు. ఏదో యింత వండి పడెయ్యగలిగితే సరి" రాజ్యం బిల్లు పాస్ చేసేసింది. నా సమస్య యింత సులువుగా తీరినందుకు నాకు చాల సంతోషం కలిగి లక్ష్మి, బాబి ఎదురుగానే రాజ్యం చెంపమీద ముద్దులిసిరేసి పరుగెత్తి స్కూటర్ ఎక్కేశాను. తిన్నగా నారాయణ యింటికే వెళ్ళాను. ఆ సమయానికి నారాయణ ఇంట్లో ఉండడని నాకు తెలుసు. సావిత్రినీ కొడుకునీ నాతోకూడా తీసుకువచ్చేస్తూంటే చుట్టుపక్కల పాకలలోంచి జనం బయటకు వచ్చి నన్ను ఒక దొంగ వాళ్ళ స్వంత వస్తువేదో ఎత్తుకు పోతున్నట్టు కోపంగా చూశారు. రాజ్యం సావిత్రిని చూసి ఆశ్చర్యపోయినట్టు అనిపించింది నాకు. వంట మనిషి అనగానే బహుశ నెత్తిమీద ముసుగు లేక కనీసం జీవితంలో సగంపడి దాటిన వ్యక్తిని ఊహించి ఉంటుంది. సావిత్రి అందుకు భిన్నంగా ఉంది. రాజ్యంకి సావిత్రి గురించి చెప్పలేదు. చెప్తే ముందే ఒప్పుకోదు.


ఆ తరవాత వరుసగా జరిగిన సంఘటనలు నా జీవితాన్ని పూర్తిగా మార్చేశాయి. సావిత్రిని మా యింటికి తీసుకు వచ్చిన రోజే సాయంకాలం ఆరు గంటలయి ఉంటుంది. సుమారుగా నా హాస్పిటల్ నిండా పేషెంట్లు ఉన్నారు. అటువంటి సమయంలో నారాయణ వచ్చాడు తుఫానులా. అడ్డు వచ్చిన కాంపౌండరుని తోసేసి నా గదిలోకి వచ్చాడు. అప్పటికి నేనొక కేసు చూస్తున్నాను. మనిషి నిషాలో తూలుతున్నట్లు కళ్ళు, కాళ్ళు చెప్తున్నాయి.

"ఏది సావిత్రి? నాయాలా! నేను లేకుండగా చూసి దాన్ని లేపుకుపోతావా? ఎన్ని గుండెలు నీకు?" అంటూ నా బల్లమీద రెండు పిడికెళ్ళతో గుద్దాడు. అనుకోని సంఘటనకి నేను బిత్తరపోయాను.

"మర్యాదగా యిక్కడినించి వెళ్తావా లేకపోతే పోలీసుల్ని పిలవమంటావా" అని నేను అనేలోగా నారాయణ నా కాలరు పట్టుకుని బయటవరండాలో మనుషుల మధ్యకి లాక్కుపోయాడు. నాకంటె రెట్టింపు బరువున్న ఆ మనిషిని నేను ఏ మాత్రం ఆపలేకపోయాను. "చూడండయ్యా పెద మనిషిని. నేను లేకుండా చూసి నా ఆడమనిషిని లేపుకుపోయి యింకా కబుర్లు చెప్తున్నాడు." నా చొక్కా ఒక్క లాగులాగి వదిలిపెట్టాడు.

నేను పూర్తిగా చేష్టలుడిగిపోయాను. పదిమంది మధ్య జరిగే అవమానంతో తలకూడా ఎత్తలేకపోయాను. కనురెప్పపాటులో అది ఒక న్యాయస్థానం అయిపోయింది. నారాయణ బిగ్గరగా అరచి నన్ను దోషిగా చేసేశాడు. మీరు భగవంతుడితో సమానం అని నన్ను కీర్తించిన నా పేషంట్లే నామీద జ్యూరీ సభ్యులయి వాడు చెప్పిన కథ విన్నారు. నా వ్యక్తిత్వం ఒక్కసారిగా మేరు పర్వతం అంత ఎత్తునుంచి నేలకి పడిపోయింది. అక్కడున్న వారందరికంటె నేను గొప్పవాణ్ణి అనే అహం నాకుంది. అందుకే వారిని నేను న్యాయనిర్ణేతలుగా అంగీకరించలేకపోయాను, వారిలో అడకేటు రామారావు వున్నాడు. కిళ్ళీకొటు అప్పలస్వామి ఉన్నాడు. మూణ్ణెల్లుగా కాళ్ళు పడిపోయిన ముసలమ్మ ఉంది. కలెకరాఫీసు ప్యూను నరసయ్య. పాచిపనులు చేసే వాడి పెళ్ళాం ఉన్నారు. నాదగ్గర ఉచిత వైద్యం పొందుతున్న రోడ్డుప్రక్క కుష్ఠురోగి ఉన్నాడు. ఆ నిముషంలో వీరందరూ నాకంటె గొప్ప





ఇటీవల జరిగిన హైదరాబాద్ ఆంధ్ర విశ్వసాహితి 16వ వార్షికోత్సవ సందర్భంలో ప్రాంతీయ సాహిత్య అకాడమీ కార్యదర్శి శ్రీ ఎ. ఆర్. శర్మ ప్రసంగిస్తున్న చిత్రం మిగిలినవారు ఎడమనుంచి శ్రీయుతులు కొత్తపల్లి సుబ్రహ్మణ్యం, కోకా రాఘవరావు, గులాబ్‌దాస్ బ్రోకర్, దేవులపల్లి రామానుజరావు, వి. నారాయణరావు. పోతుకూచి సాంబశివరావు

## "విశ్వసాహితి" వార్షికోత్సవాలు

జంట నగరాలలోని సాహితీ సాంస్కృతిక సంస విశ్వ సాహితి" 16వ వార్షికోత్సవాలు ఏప్రెల్ 30వ తేదీన హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో జరిగాయి. ఈ ఉత్సవాలకు సుప్రసిద్ధ గుజరాతీ రచయిత శ్రీ గులాబ్ దాస్ బ్రోకర్ ప్రారంభోత్సవం చేశారు.

ప్రపంచంలోని వివిధ రచయితలు కలిసి విశ్వ సమస్యలను చర్చించవలసిన అగత్యం వున్నదని శ్రీ బ్రోకర్ ఈ సందర్భంగా ఉద్బోధించారు.

తొలుత విశ్వసాహితి కార్య నిర్వాహక అధ్యక్షుడు శ్రీ పోతుకూచి సాంబశివరావు శ్రీ గులాబ్ దాస్ బ్రోకర్‌ను పరిచయం చేశారు.

రెండవరోజు జరిగిన సభకు జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు శ్రీ ఎం. వి. రాజగోపాల్ ముఖ్య అతిథిగా వచ్చారు. ఈ సందర్భంగా జరిగిన బహుభాషా కవి సమ్మేళనంలో దాదాపు 30 మంది కవులు పాల్గొన్నారు. సాహిత్య అకాడమీ కార్యదర్శి శ్రీ దేవులపల్లి రామానుజరావు అధ్యక్షత వహించారు. ★

---

వాళ్ళయిపోయారు. సమాజంలో నీతిమంతుడుగా చెలామణీ అయే డాక్టరు కంటె ఒక మెట్టు పైన ఉన్నామనే గర్వం వారి కళ్ళలో తొణికిసలాడింది. ఈ లోగా మరి కొందరు ప్రేక్షకులు వినోదం చూడడనికి వీధిలో గుమిగూడారు. అందరూ ఏమి చేసిటని కేసు వివరాలు ప్రక్కవారిని అడిగి తెలుసుకున్నారు. కొందరు సంతోషంగా వివరాలు చెప్పారు. వినేవాళ్ళు తల లూపారు. అయ్యో! యింతమంచి డాక్టరు యిలాంటిపని ఎందుకు చేశాడు అని ఆశ్చర్యపడ్డారు. నిజమేనా? అసలేం జరిగింది డాక్టరుగారూ? అని కొందరు శ్రేయోభిలాషులు అడిగారు. కొందరు నేను యిరుక్కున్న పరిస్థితి చూసి జాలి పడ్డారు. యిలాంటివి పదిగా చేయొచ్చు అవి నా చేతకానితనంక విచారించారు. 'ఆఁ డాక్టరు కూడా గటివాడే నన్నమాట' అని చిరునవ్వులు చిలికించారు. అయితే మాత్రం యిలా నలుగురిలో అవమానం చేస్తూంటే ఊరుకుంటామా? ముందా మనిషిని బయటకి పంపండి అని ప్రక్కవారి చెవిలో సలహా యిచ్చారు. రంకుతనంలోనూ, దొంగతనంలోనూ కలగజేసుకోకూడదు అని పెద్దమనుషులు శ్రోతలుగానే ఉండటాని నిశ్చయించారు.

నేను నారాయణ చేతిలో నలిగిన షర్టు సవరించుకున్నాను. అక్కడున్న జ్యూరీ సభ్యుల వెర్డిక్టు నేను వినలేదు. అందర్నీ తప్పించుకుని వీధిలోకి వచ్చేసి స్కూటర్ ఎక్కాను. నా శరీరంలో ఉన్న మనిషిని కత్తితో నిండా తూట్లు పెడేసాడు నారాయణ కానీ కొన ఊపిరి ఉండిపోయింది. నాల నేను చాలలేదు రాత్రిపది గంటలదాకా బీచ్‌లో పడుకున్నాను. ఆకాశం, సముద్రం, నక్షత్రాలు నిటితో పాచిపట్టిన బండరాళ్ళు నన్ను ఊరడించాయి. లేచి యింటికి వెళ్ళేసరికి లైట్లు యింకా వెలుగుతున్నాయి. నన్ను చూసి కాంపౌండరు తప్పుకొని గుమ్మందిగి వెళ్ళిపోయాడు. లోపల రాజ్యం సావిత్రినీ, కొడుకునీ వీధిలోకి సాగనంపడానికి తగిన ప్రయత్నం చేస్తోంది. సావిత్రి ఏడుస్తూ బ్రతిమాలుకుంటోంది. నన్ను చూసిన తరువాత రాజ్యం కంఠం తారస్థాయికి లేచిపోయింది. నేను ఎవరివంకా చూడకుండా నా గదిలోకి నడిచాను.

రాజ్యం ప్రయత్నం విఫలమయి పావుగంట తర్వాత నా గదిలోకి వచ్చింది. "ఆ త్రాష్టురాలు ఈ యిల్లు వదలదట. మీరు తెచ్చి పెట్టిన తద్దినమే, ఎలా పంపుతారో పంపండి. యిప్పటికయిన నిర్వాకం చాలు."

యింతలో సావిత్రి వచ్చి ఏడుస్తూ నా కాళ్ళు పట్టేసుకుంది. "బాబుగారూ యిప్పుడు నేను బయటికి వెళ్తే నన్నూ నా కొడుకునీ కూడా కోపంతో ఆయన చంపేస్తాడు. కొంచెం దయ చూపండి. ఒక్క నాలుగు రోజులు మీ నీడలో ఉండనిస్తే తర్వాత ఎటయినా వెళ్ళిపోతాను. నా కొడుకు ముఖం చూసయినా నన్ను మన్నించండి" అంటూ భోరుమని ఏడ్చింది. నేను మనిషిని. పెనుతుఫానులో తడిసి రెక్కలారుస్కోడానికి నా యింట్లోకి చేరిన పిచుకని మళ్ళీ తుఫానులోకి చావమని తరమలేను. రాజ్యం మా యిద్దరికేసి కసిగా చూస్తోంది. సావిత్రి నా కేసి ఆశగా చూస్తోంది. సావిత్రి కొడుకు వాసు అందరికేసి బిక్కపోయి చూస్తున్నాడు.

రాజ్యం నా మనసుని ఒక క్షణంలో చదివేసింది, "ఛీ! సిగ్గులేని మనుషులు. మొదటిసారి దీని ముఖం చూడగానే అనుకున్నాను. యిటువంటి బాపతు అని" చూపులో అసహ్యం నింపేసి వెనక్కి తిరిగింది. నాలో చచ్చిపోతున్న పురుషుడు ప్రాణం కూడదీసుకున్నాడు.

వెళ్ళిపోతున్న తనని రెక్క పట్టి బలంగా నా వైపు తిప్పి నిలబెట్టాను.

"నీ మాటలలో ఉద్దేశ్యం ఏమిటి? నేనెందుకు సిగ్గుపడాలి?"

"ఉద్దేశ్యం ఊరందరికీ తెలుసు. ఈ యింట్లో నేనుండాలో, అదుండాలో తేల్చుకోండి" నన్ను విదల్చుకుంది రాజ్యం. నా భార్య! నా పిల్లలకి తల్లి.

అన్నేళ్ళ సాహచర్యం రుచి చూసి నన్ను అంత అల్పుడిగా అంచనా వేసిన నా భార్యపై నాకున్న ప్రేమ ఏదయినా అది ఆ క్షణంలో హరించుకుపోయింది.

అప్పటికే నలభయిమంది మూర్ఖులు నేను చెయ్యని నేరానికి నన్ను సిగ్గుపడమని బలవంతాన తలవంచారు. ఈ స్త్రీ నా భార్య కూడా అదే ప్రయత్నంలో నా తల తన చెప్పు కాలితో అణగద్రొక్కాలని ప్రయత్నిస్తోంది.

"సావిత్రి ఈ యింట్లోనే వుంటుంది. నీకిష్టం లేకపోతే నేనేం చెయ్యలేను" చెప్పేశాను. దాని పర్యవసానం నాకు తెలుసు. అయినా నా నిశ్చయం మారలేదు. రాజ్యం ఒక గంటసేపు హిస్టీరియా వచ్చిన దానిలా ఏడ్చింది రాజు బాబి, లక్ష్మి కూడా తల్లితో సమంగా శ్రుతి కల్పి కాసేపయిం తర్వాత అలసిపోయి నిద్రపోయారు. అర్ధరాత్రి దాటిన తర్వాత రాజ్యం ముక్కు చీదుకొని కళ్ళు తుడుసుకొంది. మూటా ముల్లె సర్దింది. నేను మరొక్క మాట అనలేదు. తెల్లవారేసరికి ఆ యింట్లో నేనూ, సావిత్రీ, తన కొడుకూ, మరి బోల్డు నిశ్శబ్దం మిగిలాం. మూడు రోజులు గడిచిపోయాయి. నేను యాంత్రికంగా క్లినిక్‌కి పోయి వస్తున్నాను, జనం పలబడిపోయారు. ఎవరో ఒకరిదరు తప్ప. నా కథ టౌనంతా చిలవలు పలవలుగా వ్యాపించేసింది. చివరకి సావిత్రి నా స్థితి చూసి తనదారి తను చూసుకుంటానంది. నేను ఒప్పుకోలేదు. నీకొచ్చిన భయంలేదు. ఉండిపో అన్నాను. నేను యింట్లో లేనప్పుడు నారాయణ కనుక్కుని వస్తాడని భయంవేసింది. నాకుతెలిసిన పోలీస్ యిన్‌స్పెక్టరు ఒకడున్నాడు, అతని దగ్గరకెళ్ళి సంగతంతా చెప్పాను.

"లారీ డ్రైవరు నారాయణా! వాడు మాకు పాతనేరమే. వాడెవరికీ భయపడేరకం కాదు. అయినా ఒకసారి పిల్చి బెదరిస్తాలెండి" అన్నాడు. అంతటితో ఆగక యిలా అన్నాడు. "ఏమిటి డాక్టరుగారూ! మీ కెందుకొచ్చిన తంటా! అది మహా పతివ్రతని నమ్ముతున్నారేంటి? వాడికీ దానికీ ఏదో చెడిఉంటుంది. మీ దగ్గిర దాని ఆటలు సాగాయి. ఇలాంటి బజారు ముండల్ని నమ్మకూడదుసార్! మీకు తెలియక దాని వలలో పడ్డారు. ఏదో ఒకసారి చూసీ చూడనట్టు వదిలి పెట్టేయాలి." అని నవ్వాడు. ఆ మాటలలో గూఢార్థం తెలిసి చాచి చెంప అదరగొట్టాలని అనిపించింది. మ్రింగుకుని నోరు మూసుకుని వచ్చేసాను.

నా మిత్రులు బోల్డుమంది నా యింటికి వచ్చి సలహాలిచ్చారు. సావిత్రిని చూడడానికి తహతహలాడారు. నా అదృష్టానికి లోలోపల ఏడ్చుకున్నారు. నిక్షేపంలాంటి భార్యని వదలిపెట్టి యిదేంపని అన్నారు. యిప్పటికయినా మించిపోయిందిలేదు ఆ మనిషిని పొమ్మని చెప్పమని సలహాలిచ్చారు. మనుషులలో అంతటి కుళ్ళు, మోసం ఉంటాయని మొదటిసారిగా తెలిసింది.


అందరూ నాకు చెప్పినకొద్దీ నా మనసు మరింత మొండికేసింది. క్రమంగా సావిత్రిని కాపాడాలన్న కోరిక కంటె నా పట్టుదల నెరవేర్చుకోవాలనే కాంక్ష పెద్దదయిపోయింది. ఆఫ్టరాల్! నేను నా మనసుకి మంచి అనుకునే ఈ చిన్న పని చెయ్యడానికి స్వాతంత్ర్యంలేదా? ఇందులో కూడా ఊరందరి ఐక్యం కావాలా?

మా మామగారు నేను చేసిన బుద్ధిలేని పనికి తిడ్తూ ఉత్తరం వ్రాశారు నాకు బుద్ధి కలిగినట్టు నమ్మకం కలిగిన తరువాతే కూతుర్ని, నా పిల్లల్ని వచ్చి తీసుకెళ్ళమని వ్రాశాడు. ఉత్తరం చింపి ముక్కలు చేశాను.

నాకు పిచ్చెక్కిపోతుందేమోనని అనుమానం వేసింది. ఈ సంఘంలో మనుషులు నాకిచ్చిన గౌరవం ప్రతిష్ఠా విత్‌డ్రా చేసుకుంటామని బెదిరిస్తున్నారు. రాజ్యం నా పిల్లల్ని నాకు కాకుండా చేస్తాననంటోంది. అంతా బ్లాక్ మెయిల్! నా మెడలు వంచాలనే ప్రయత్నం. నేను చేయని నేరాన్ని నా చేత ఒప్పించే యత్నం. నాలో ఒక వింత సక్సెలైట్ రివల్యూషన్ లాంటిది బయలుదేరింది. అందర్నీ నరికి పోగు పెయ్యాలనే కసి కలిగింది. నాకు మానవత్వంలో ఉన్న నమ్మకమే పోయింది.

ఆ రోజు రాత్రి నేను యింటిముందు స్కూటర్ దిగేసరికి చుట్టూ ఒక పాతికమంది మూగారు. నారాయణా, అతని అప్తులూ. తరువాత నాకు జరిగిన సన్మానం అందరూ ఊహించగలిగినదే.

"ఎరా పెద్ద మగోడి ననుకుంటున్నావా? పోలీసోళ్ళు నన్నేం చెయ్యలేరు. నేను తలుచుకుంటే నిన్నూ, దాన్నీ కలిపి నరికేస్తాను యిక్కడే. దేవుడు కూడా సాక్ష్యానికి రాడు." నారాయణ వికటాట్టహాసం చేశాడు. "ఒరేయ్ ఆ ముండని కూడా ఈడ్చుకు రండిరా మజా చూపిస్తాను" అన్నాడు. వాడి ఆజ్ఞ నిమిషంలో అమలు జరిగింది. మా వీధిలో జనం అంతా తలుపులు, కిటికీల వెనకాలనుంచి ఫ్రీగా వచ్చిన వినోదం చూస్తున్నారు. ఆ పశువుల చేతులలో సావిత్రిని చూసి నాలో పురుషుడు మండిపోయాడు. రక్తం సెగలు కక్కింది విరిచి పట్టుకున్న నా చేతులు విదిల్చుకొని నారాయణ గడ్డం ఊడేలా ఒక్క పెట్టు పెట్టాను. మరునిముషంలో అంతా కేకలు, భీభత్సం. నా బొక్క విరిగింది. జుట్టు సగం ఊడింది. నా శరీరం ముద్దలు కట్టింది అంతాకలసి నా స్కూటర్ మీద పెట్రోలు పోసి అంటించారు. సావిత్రి, కొడుకూ కూడా నా పరిస్థితిలోనే ఉన్నారు. ఈలోగా ఏ దయామయుడి సహాయం వల్లనో హడావుడిగా పోలీస్‌వాన్ వచ్చింది. నిముషంలో వీధి ఖాళీ అయింది. దుమ్ము కొట్టుకున్న శరీరాలతో నేనూ, దాదాపు వివస్త్ర అయిన సావిత్రి, స్పృహతప్పిన మురళి, బొగ్గు అయిన నా స్కూటరు మిగిలాము. మా శరీరాలు యింట్లోకి చేరేశారు. పోలీసులు జరిగిపోయిన సంఘటనని పోస్టుమార్టమ్ చేశారు. ఏం జరిగిందో



దీర్ఘ వ్యాధులకు చిత్రమైన సిద్ధ వైద్యం!



హస్త ప్రయోగం, అంగము చిన్నదై అవసర కాలమందు అసంతృప్తి, శుక్లనష్టము, నపుంసకత్వము, హెర్నియా, చర్మవ్యాధులు, పోస్టు ద్వారా కూడా వైద్యం చేయబడును. వరిబీజము (బుడ్డ), మూత్ర వ్యాధులు ఆపరేషన్ లేకుండ. రండి.

డా॥ దేవర, షాప్ 551, మార్వాడి గుడి వద్ద, తెనాలి

"ఆంధ్రజ్యోతి"

దినపత్రికనే చదవండి

REGD.

SEALED PACKING OF 6 & 14 TABLETS AVAILABLE AT ALL CHEMISTS

Mfrs.: SEENU & CO., MADRAS-21

మూలశంకకు త్వరగా నమ్మకమైన హెడన్సా విరేచనముతో చికిత్సను పొందండి - శస్త్రచికిత్స అవసరములేదు!

చెప్పండి అన్నారు. నా శరీరం నా స్వాధీనంలోకి తెచ్చుకున్నాను. చెప్పడానికేమీ లేదు. ప్రయోజనమూలేదు. వెళ్ళండి. అన్నాను. నాకు పిచ్చెత్తింది. కొంతసేపు ఏడ్చాను. తరువాత నవ్వాను. వాళ్ళూ అదే అనుకుని తోచినదేదో కంప్లయింట్ వ్రాసుకుని వెళ్ళిపోయారు.

నా మనసులో పగ రాజుకుంది. ఈ సంఘం, రాజ్యం, నారాయణా అంతా ఒకటే. నన్ను తరుముతున్నారు. నన్ను నిరాయుధుడ్నిగాచేసి ఏడిపించా లనుకుంటున్నారు. నాలో మంచిని పాతర వెయ్యాలనుకుంటున్నారు. వీళ్ళందరిమీదా నాకు కసి. నేను వీళ్ళకి తల వంచను. నా ప్రయత్నంలో నా చాతకాని ప్రాణం పోయినా సరే, నా కళ్ళల్లో నీరు ఊరుతున్నట్టే నా మనసులో పగ ప్రజ్వరిల్లింది. నా శరీరాన్ని చంపగలిగినట్లు నా మనసుని చంపగలమని అనుకుంటున్నారు. కళ్ళు తుడుచుకుని పగలబడి నవ్వాను. ప్రపంచం, దేముడు, మంచితనం అంతా దగా. ఏమీ లేవు. అంతా ఒక అడవి. అందరూ జంతువులు. నాలో మనిషిని పీక్కుని తినేయడానికి సిద్ధంగా ఉన్నాయి. కోరలు చూపిస్తున్నాయి. పంజాలు చాస్తున్నాయి. దాచుకొంటాను. నా మంచితనాన్ని, మానవత్వాన్ని రక్షించుకుంటాను. నేను వీటికి భయపడను. నా రక్తం ఆవిరిగా మారుతోంది. ముక్కులోంచి. నోరు, చెవుల లోంచి సెగలుగా వచ్చేస్తోంది. నేను గాలిలో తేలుతున్నట్టనిపించింది. అందరిమీదా కసి తీర్చుకోవాలి. నా కొక్కటే ఆలోచన.

క్రిందపడి యేడుస్తూవున్న సావిత్రిని పైకి లేవదీసాను. అంతవరకూ ఆమెలో నాకు కనపడని అందంకోసం, ఆకర్షణ కోసం వెదుక్కున్నాను. ఆశరీరాన్నిగట్టిగా కౌగలించుకొని "సావిత్రీ! నిన్ను పెళ్ళి చేసుకుంటాను నాకెవరూ లేరు. భయపడకు" అన్నాను. ఆమె మరింతగా ఏడుస్తోంది. "నువ్వుకూడా నన్ను పిచ్చివాడను కుంటున్నావా? నామాటలు నమ్ము. అని, పగలబడి నవ్వాను. ఆమెకి నమ్మకం కలిగించడం కోసం నువెంతో అందంగా ఉన్నావన్నాను. పెదవులు ముద్దాడాను నవ్వుతున్నాను. నన్ను విదిలించుకుని దూరంగా జరగబోతే మరింత దగ్గరకి లాక్కున్నాను. ఈ మనుష్యుల్ని నమ్మొద్దులే. భూమీ. ఆకాశం, ఈ గదీ సాక్షులు. నువ్వే ఈ క్షణం నుంచీ నా భార్యవి. ఎవరూ యింక నీ మీద చెయ్యి వెయ్యరు అభయం యిచాను. నిస్సత్తువుగా ఉన్న ఆమె అందాన్ని నాలో కలుపుకున్నాను. ఓ సమాజమా! సావిత్రిలో అందమయిన వంపులన్నీ నావే. అసూయపడి కుళ్ళి చావమని అరిచి తిట్టాను. ఆతరువాత ఏంజరిగిందో నాకు తెలియ లేదు.

నేను కళ్ళు విప్పేసరికి తెలతెలవారుతోంది. ఏదో పీడకలలోంచి లేచినట్లు లేచాను గభాలున. యింట్లో ఎక్కడా సావిత్రి, కొడుకూ జాడలేదు. వెళ్ళిపోయింది ఎక్కడికో. సావిత్రి కూడా నన్ను అసమర్థుడిగా జమకట్టింది. నా మాటలు పిచ్చివాడి మాటలుగ అనుకుంది కాబోలు. స్మశానం లాంటి యింట్లో ఒక్కడ్ని మిగిలాను. నా కెవ్వరూ లేరు. యిల్లు విడిచి బయటకు అడుగు వేసి అందరిముందూ తల వంచలేను నేను. నాలో మనిషి యిన్ని విధాలుగా చావు దెబ్బలు తిన్నా అహంకారం చంపుకో లేదు. నాకిప్పుడు ఈ ప్రపంచం ఏమీకాదు. నా పరువు ప్రతిష్ఠ గంగలో కలిసి పోయాయి. నా పిల్లలు, నా సంసారం

ఉత్పత్తిని పెంచుదాం - సౌభాగ్యాన్ని పొందుదాం

ఏమీ లేవు. నాకు తెలుసు. నేను చేయని తప్పు ఒప్పుకుంటే అందరూ నన్ను క్షమిస్తారు. రాజ్యం విజయగర్వంతో నన్ను చూసి నవ్వుతుంది. సమాజానికి నేను మళ్ళా దాకరుగా ఆత్మీయుడినయిపోతాను. కొన్నాళ్ళకి అందరూ మరచిపోతారు. కాని నా మనసు మరచిపోలేదు. అందుకే నేను చావాలని నిశ్చయించుకున్నాను.

నా దగ్గరున్న 'మార్ఫిన్' ఎంప్యూల్స్ అన్నీ బద్దలుకొట్టి పెద సిరంజిలోకి ఎక్కించాను. యిద్దరు మనుషులు చావ గలిగినంత డోసు తయారయింది. ఒక తొడలోనికి సగం, మరొకదాని లోకి మిగిలింది ఎక్కించాను.

కొంచెంసేపట్లో ఈ కుళ్ళు సమాజం నుంచి విముక్తి కలుగుతుంది. నాకెంతో హాయిగా అనిపించింది. "ఓ ప్రపంచమా నువ్వు నన్నేం చెయ్యలేవు. నేను నీకు బానిసను కాను. నీకు తల వంచుతా ననుకున్నావ్ కదూ! పూర్ ఫెలో నా పెళ్ళాం! రాజ్యం కూడా అలాగే అనుకుంది." యిప్పుడు చూడు నా చచ్చిన శరీరం మీద పడి ఎలా ఏడుస్తుందో? నువ్వు ఏడు

స్రావు ఒక డాక్టరు తగ్గిపోయాడని. నేనలా గోడలతో, గాలితో, వెలుతురుతో మాట్లాడుతూండగానే నా శరీరం తేలిపోతోంది.

"సావిత్రీ! ఎక్కడికని పోయావ్! ప్రపంచంలో ఏమూల కెళ్ళినా బోల్డు నారాయణ లున్నారు. నన్ను నమ్మలేక పారిపోయావు, నీ ఖర్మ! గుడ్‌బై" అని చెప్పేశాను.

నా నుంచి పారిపోయి సావిత్రి నానుంచి తనని రక్షించుకుందా! తననుంచి నన్ను రక్షించిందా. ఏమో! ఆలోచించడానికి నాకు మనసు మిగలలేదు.

మనసుకీ, శరీరానికీ మధ్యగా తెరపడిపోయింది. ★


# జై కిసాన్ యూరంఫాస్ 28:28:0 ఎన్ పి కె

## ఆదర్శమైన రసాయనిక ఎరువు




యూరంఫాస్ 28:28:0 'ఆదర్శమైన రసాయనిక ఎరువు' మీ జువారి డీలరువద్ద దొరుకుతుంది.

- ఇది అన్ని పైరులకు తగిన శక్తివంతమైన కాంప్లెక్స రసాయనిక ఎరువు.
- దీనిలో మొక్క పెరుగుదలకు కావలసిన కీలక పోషక పదార్థములు 56 శాతం ఉంది. అంటే 28 శాతం నత్రజని—మొక్క ఏపుగా పెరగటానికి, మరియు 28 శాతం భాస్వరము—పూర్తిగా కరుగు రూపంలో—వేళ్ళ పెరుగుదలకూ, బాగా గింజ కట్టడానికి.
- సమానమగు ఒకే రకమైన గుళికల వలన పోషక పదార్థములను పొలం అంతటా సమంగా వేయుటకు వీలౌతుంది.
- గుర్తుంచుకోండి! జైకిసాన్ రసాయనిక ఎరువులు తేలిక పసుపు రంగు వేసిన జైకిసాన్ గుర్తుగల దుకాణంలో దొరుకును.

యూరంఫాస్ 28:28:0 అధిక దిగుబడికోసం, పుష్కలమైన లాభాల కోసం

| |
|---|
| సరిసమానమైన పోషణ ఎక్కువగా కావలసినప్పుడు, మేము సిఫార్సు చేసేది: జైకిసాన్ సంపూర్ణ 19:19:19 ఎన్‌పికె సంపూర్ణ రసాయనిక ఎరువు |









జువారి అగ్రో కెమికల్స్ లిమిటెడ్, గోవా.

ప్రాంతీయ విక్రయ కార్యాలయాలు: కర్నూల్, సికింద్రాబాద్, పంజిం, బెంగుళూరు, హుబ్లి, నాగ్‌పూర్, పూనా.

లింటాస్-ZUA.37A-140 TL (RR)